
“ఒరే! ఒర్రామూలూ! ఇంత లెగరా బాబూ ఇంత బద్ధకమైతే బువ్వెట్టొత్తదిరా?”

“ఒలే నరసా! పనికి యాలవుతుంది లెగే పనిచేత్తన్నావంటే ఎట్టాగుండాల సేతిలోపని లాక్కొని సెయ్యాల. కడుపులోది తీసుకుతినాల.”

తులసమ్మ పిలుపులే కోడికూత. ఆ ఇంట్లో అద్దెకు ఉండే ఎనిమిది భాగాలవాళ్ళకూ. తూరుపు తెల్లవారక ముందే పేరుపేరున మేలుకొలుపు పాడుతుంది తులసమ్మ. మూత తీయగానే రెక్కలు టపటప కొట్టుకుంటూ బయటకు ఉరికే కోళ్ళలా తులసమ్మ లేచిన కాసేపటికి అందరూ లేచి హడావిడి పడతారు. కోళ్ళు ఆ కాసేపు రెక్కలుకొట్టుకొని తర్వాత రోజంతా తినితిరగడమే. కాని వీళ్ళు రోజంతా రెక్కలు కొట్టుకొంటేనే మాపటికి తిండి. రేపటికి చద్ది.

# చేపలు

ఓ. సుజాతాదేవి



తులసమ్మ నలుగురి వైపు నాలుగు కేకలు విసురుతూనే ఇంటిలో పనులు చకచక చక్కపెట్టింది. తల్లి కేకలకు మెలకువ వచ్చినా చాపమీద ముణగదీసుకొని పడుకొన్న కూతురు చిట్టిని కానీ, నణుక్కుంటూ నులకమంచం మీద ముణగదీసుకుని పడుకొన్న మొగుణ్ణి కానీ లేపదు.

‘పాపం వాళ్ళు లేచి ఏం చేయాలి?’

ఏడాది క్రితం ఏక్సిడెంటులో కాలు విరిగి మూలబడింది చిట్టి. ఇంక బసవయ్యకు “కర్ర బట్టుకు గుమ్మంలో కూర్చుంటే కుక్కో, మనిసో అని తెలుత్తదిగానీ; ఆడో, మగో అనమాట కట్టలేను” అంటుంటాడు. కన్ను మసకైనా కాలు అవుదైనా కడుపుకు ఏ అడ్డూ లేదు కదా! పైగా వాళ్ళిద్దరికీ మందులూ. తులసమ్మ చాలీచాలకుండా సంసారం నడుపుకొస్తూ పొట్టకాలు పిట్టని కట్టుకొనే నాథుడెవడా అని కాళీదొరికినపుడల్లా విచారిస్తూ వుంటుంది.

తులసమ్మ పదిళ్ళలో పాలపొట్లాలు ఇచ్చుకొని పనిచేసే ఇంటికి వెళ్ళేసరికి తెల్లటి తెర తీసుకొని ఎండ చురచుర చూస్తుంది. అంతకన్నా కరకరలాడిపోతూ అమ్మగారు హారతి పట్టింది. ఆవిడేమన్నా పడి ఊరుకుంటే మరీ పైన బడి కొట్టినంత పనిచేస్తుందని తన తప్పున్నా ఒప్పుకోదు తులసమ్మ. “ఏం చేయమంటారు? మాకూ పనులుంటాయి” అని ఎదురు

తిరుగుతుంది.

"సాయంత్రం త్వరగా రా. లక్ష్మికి పెళ్ళి చూపులు" అన్నదావిడ.

"ఏ ఊరమ్మా!" సంబరంగా అడిగింది తులసమ్మ.

"ఏదో ఒక ఊరులే" అందావిడ విరుపుగా.

మా అమ్మాయి పెళ్ళి కుదిరింది అని నలుగురికి చెప్పుకునే రోజు తన కెప్పుడొస్తదో అనుకుంటూ ఇంటిదారి పట్టింది తులసమ్మ

గుమ్మంలో అడుగుపెట్టేసరికి ముసి ముసి నవ్వులతో ఇంటిలోంచి బయటకు వస్తున్నాడు చివరి వాటాలోని రిక్షా రాములు.

"ఎవర్రాదూ! ఎవుడసె?" అంటున్నాడు గుమ్మంలో కర్రబట్టుకొని కూర్చున్న బసవయ్య.

"నేనే.... మావా! బీడి ఎలిగించుకుందామని" అన్నాడు రాములు.

"మావేంటి?.... మావ" ఈసడించుకుంటూ తులసమ్మ ఇంటిలో అడుగుపెట్టేసరికి కాలీడ్చుకుంటూ చిట్టి పొయ్యి అంటిస్తోంది దాని చేతిలో పకోడీంపొట్లం. జడలో చామంతి చెండు. కళ్ళలో మెరుపు బుగ్గమీద సిగ్గు. కొట్టొచ్చినట్లు కనబడుతున్నై.

"ఎందుకొచ్చాడేఅదు" అని కూతుర్ని నిలదీసింది చాలాసార్లు. ఏదో ఒకటి చెప్పుద్ది చిట్టి అడినడిగితే అల్లరి తప్ప ఏమీ లేదు— అయినా ఊరుకోలేక పోయింది తులసమ్మ.

"ఎన్నిసార్లు చెప్పాలే.... ఏంటాడితో సేయితం నీకు" అని మందలించింది. ఆ మాత్రానికే చిట్టి చెక్కిళ్ళు తడిసి పోయాయి.

"నెత్తిమీద నీళ్ళకుండతో పుట్టావే తల్లీ. నువ్వా అందర్లాంటి దానివి కాదు. అడా పెళ్ళయినోడు. నేనా బతికినంత కాలం బతకను. అనక నీ బతుకు ఏమవుతుందో ఆలోచించుకో.... ఆణ్ని గుమ్మం దొక్కనీమాకు" అంది తులసమ్మ.

చిట్టి వెక్కిళ్ళు పెట్టి ఏడ్చింది. తులసమ్మ మనసు కరిగి కళ్ళు తడిసినై. 'పాపం అవిటిది నలుగుర్లో తిరగలేదు.




ఆదేదో నాలుగు మాటలు చెప్పేతలికి మురిసిపోతందేగాని ఎనకే మాట ఏసుకోవాలో తెలవదు' అని కూతురిమీద జాలి పడి ఓదార్చింది తులసమ్మ. తను తెచ్చిన అరలీటరు పాల ప్యాకెట్టులో సగంపాలు రాముడి పెళ్ళానికి ఇచ్చింది. ఉన్నవాటిలో ఉగ్గు గిన్నెడు పాలలో కాస్త బెల్లం ముక్క వేసి టీ మరగబెట్టి మొగుడికీ, కూతురికీ ఇచ్చింది. ఎసట్లో బియ్యం పోసి సిట్టిని పొయ్యి మంటపెట్టమని చెప్పి చెంబూ, తప్పేలా బైటవేసి తోమడానికి కూర్చుంది.

"పిట్టకి సమందాలేమన్నా సూత్తన్నావా?' నసారాలో కూర్చుని కోళ్ళకు తౌడుండలు తినిపిస్తున్న జాలయ్య పలకరించాడు.

"ఏం చూర్దమో- ఎవుణ్ణి కదిలిచ్చినా ఎంతిత్తావు ఏం పెడతావు అనడిగేవోళ్ళే ముక్కూ మొకం లేనోడి కూడా మాట గావాలి".

"అ.... ఉప్పుడు పరిపితట్టాగే ఉంది. ముక్కూ మొకం లేకపోయినా మొగాడయితే సాలు. అందులోనూ నీ కూతురు సొట్టది. నాలుగు డబ్బులెక్కువీయకపోతే పెల్లదు."

"అ.... సాల్లెగవయ్యా సెప్పొచ్చావు గాని. నీలాగా కోళ్ళబేరంగాదు అరకోడిని బట్టుకుని అరకిలో తౌడు తినిపించావు. తూకంలో కాస్త మాయజేసి రెండు కిలో లుందంటావు" తౌడుబాగా తిని బరువుగా నడుస్తున్నకోళ్ళను ఈసుగా చూస్తూ అంది తులసమ్మ.

జాలయ్య ఏదో అనబోయాడు అంతలోనే మూడో వాటాలోంచి గోలగోలగా అరుస్తో బైటకొచ్చింది చంద్రమ్మ. 'ఏంటీ.... ఏంటీ' అని మూగారంతా.

"రాత్రి అదు ఇంటికి రాలేదని చెంద్రమ్మ చెబితే కనుక్కొద్దామనెళ్ళా. ఊడితోపాటు తాగిన పదిమందికీ పేణం మీదికొచ్చింది. ఎవులో అస్పత్రిలో చేర్చారు" అన్నాడు చంద్రమ్మ అన్న.

"ఏమిటి? ఏమైంది?" అని అడిగారంతా.

"ఇంకేముంది కల్తిసారా నీలు కలిపి డబ్బు జేసుకునేదిసాలక విసాకోసమేందో కలిపారు" చంద్రమ్మ కొడుకును తీసుకుని గగ్గోలుపెడుతూహాస్పిటల్‌కువెళ్ళింది.

"చూశావా .... కాలమెట్టాగై పోతందో. కట్టబడి సంపాదించిందంతాఅళ్ళమొకాన్నే పోత్తున్నారుగదా పేణాలుకూడా దక్కకుండాజేసి అళ్ళు డబ్బు సంపాదించాలా" తులశమ్మ.

"బాగుంది నువ్వు చెప్పేది. ఏమో సవూలేకుండా అంతంత మేడ లెటాలెగుస్తున్నై. కాలమేం జేత్తది? పిచ్చి ముండా క్రకం. అదెప్పుడూ రోజులూ, వారాలు, నెలలూ, సమచ్చరాలు - మాయగా తిరిగి పోడమే. మణిసి మారిపోతున్నాడు తెలివిమంతుడై పోతున్నాడు. తెలివెందుకయ్యా అంటే పక్కనోడి నెత్తినచేతులెట్టడానికే"

అన్నాడు జాలయ్య.

పాపం చంద్రమ్మ మొగుడికెలా వుంటుందో' అనుకుంటూ మిగిలినపనులు పూర్తిచేసుకుంది తులసమ్మ.

బుట్టలో ఇంత బూడిద పోసుకుని. కత్తిపీట పట్టుకుని చాపల మార్కెట్‌కు బయల్దేరింది.

"కొరమేనుపిల్లేమన్నా సవగ్గా వుంటే సూడే'' అన్నాడు వెనకనుంచి బసయ్య.

"ఆః కొరమీనేః దొరలకాదుజ్జోగం పోయినా రుసులువట్టుకు వొదల్లేదయ్యో విన్ను'' అంటూ విసురుగా వెళ్లింది తులసమ్మ.

ఆ రోజు సోమవారం మార్కెట్‌లో బేరాల్లేవు. అంచరూ కత్తిపీటలు ముందు పెట్టుకుని కబుర్లు చెప్పుకుంటూ కూర్చున్నారు.

తులసమ్మతోపాటుపదిమందిఉంటారా మార్కెట్లో. ఉదయం ఎనిమిది గంటలయేసరికి కత్తిపీటల్తో మార్కెట్‌లో కూర్చుంటారు.

చాలామంది చేపలు. రొయ్యలు కొని. ఇంట్లో వీలుకాకో చేతకాకో. వాళ్ళతో శుభ్రంగా తోమించి. కిలోకింత అని ఇస్తారు.

"మా యాయనకివాళ కొరమేను గావాలంట" నవ్వింది తులసమ్మ.

"కొరమేనెందుకులేవేః అదుగోమూడు రోజులునుంచీ ఉంది సూడా సొర చేప. పగలు బైటపెట్టి రేత్రి అయిసులో పెట్టి అదమ్ముడు పోక నానా అవస్త పడుతున్నాడు రామారావు. ఎంత కిలో పదే రూపాయలేగా అదట్టుకెళ్ళి మీ యాయనకు ఏపుడేసి పెట్టే" అని పకపక నవ్వింది సుబ్బమ్మ.

ఓ సంతలా నవ్వమాకే ఆటిరుసి మాకూ తెలుసుకాని. మా యాయన వాసి మేన్‌గా ఉన్నప్పుడు అట్టాచెయ్యి కానాతిన్నాడు. ఒకోపాలింటికూ్కుడా పట్టుకొచ్చేవాడు అంది తులసమ్మ.

ఇంతలో ఎవరో ఒకాయన కిలో బొమ్మిడాయలు బాగు చేసి ఇమ్మని వచ్చాడు. నా ఒంతంటే నా ఒంతనుకుని సుబ్బమ్మా. లక్ష్మి. అవి బాగు చెయడాని కూర్చున్నారు.

అతని దగ్గర చిల్లరలేదని ఇద్దరి ముగ్గుర్నడిగి లేదనిపించుకొని. అల్లం. ఉల్లిబందులు కొని తెస్తానని వెళ్ళాడు. అతను తిరిగొచ్చేసరికే అయిదారు బొమ్మిడాయలు పీటకిందకు తోసేసింది సుబ్బమ్మ. ఆయనొచ్చి రూపాయిచ్చాడు.

'ఏంటండీ రూపాయిత్తారుః' అని ఎర్రగా చూసింది.

'నేనెప్పుడూ కిలోకి రూపాయేఇస్తున్నా అన్నాడతను బలేవోడివే. . రూపాయన్నర జేసి ఆరు నెల్లయింది. అయినా మీరేం సేప జేయించారో. కొరమేను బొచ్చె. రూపాయికి చేసినా బొమ్మిడాయి చైతం చానా కష్టవండి. మీకు తెలవకపోతే మీ ఇంట్లోఆడోళ్ళనడగండి అందిసుబ్బమ్మ.

అతను సణుక్కుంటూ మరో అర్థ రూపాయిచ్చి వెళ్ళిపోయాడు.

ఏంటి కిలోన్నరకు రూపాయిత్తానంటన్నాడాః అంది బొమ్మడాయలమ్మి నావిడ.




"కిలోన్నరాః కిలో అన్నాడే" తెల్లబోయింది సుబ్బమ్మ.

"ఆయనంటవేంటి మీ కళ్ళేమైనై" అన్నాడు రామారావు.

ఏమో ఇవాళేకళనుందో తూకం సమానంగా తూసిందనుకున్నా. ఉండుసూ సొత్తా అని ఒక్క ఉదుటున బైటకువరుగెత్తింది

"ఇంకెక్కడుంటాడు. మ షా గా లు కూడా ఇందాకే కొన్నాడు" అంది తులసమ్మ.

నెమ్మదిగా తిరిగొచ్చింది సుబ్బమ్మ.

"అయినా పెద్ద మణిసిలా గున్నాడు అంతబద్దమా పదే రూపాయలెట్టి కావలుగొన్నాడు. రెక్కలుబడిపోయేట్టుపేసిందా నికోరూపాయివ్వలేడా. అయినా ఆడెలుగు బంటిమొకం నా కానమాలే. మళ్ళా రాడా. నేపట్టుకుదులపనా" అంది సుబ్బమ్మ.

"ఇంక ఆ సొరసేపమీద ఆశ ఒదులుకుని ఏదోకాడికి ఇచ్చే బాబూ. మొన్నిట్టాగే ఆశకుపోతే మూడు కిలోలు సేపలు మురిగిపోయినై. యాపారవన్నాక పట్టూ ఇడుపూ ఉండాలిగాని పెట్టిక్కూ కూసుంటే పెడేది మనవే" అంది తులసమ్మ రామారావుతో.

ఆ మాటతో. రామారావు సొరచేప కోయించి పోగులు పెట్టాడు. ఎర్రగా తాజాగా కనబడడానికి పైపైన కాపిరంగునీళ్ళు జల్లాడు.

అప్పుడే ఒకామె పెద్ద వాలగ చేపను కొనుక్కొచ్చింది. అది తులసమ్మ ఒంతుకొచ్చింది.

"బలే కాస్సు గొట్టావులే" వాలగను చూస్తూ ఈర్ష్యగా అంది సుబ్బమ్మ.

ఏమి కాస్సులే ఒచ్చేక ఇదేగదా బేరం అంది తులసమ్మ. అందేగాని లోలోపల తులసమ్మకూ్కుడా సంతోషంగానే ఉంది. వాలగ ఎవరు బాగుచేసినా. పనికిరాని భాగంతోపాటు పక్కలు దగ్గరదగ్గర సగం కోసేత్తారు. పొలుసుఉండదుకనుక శుభ్రం చేయడం తేలిక. ఆ కోసినవన్నీ అమ్ముకుంటే రెండురూపాయలు తేలిగ్గావస్తాయి.

"తులసమ్మ వాలగ కోసేసరికి దాని కడుపులో జానెడు పైగా చేప ఉంది.

"ఓసి దీని దుంపదెగ ఎంత చేపను మింగిందే అంది లక్ష్మి.

"ఎందుకు మింగదు. దీనికన్నా పెద్ద

దుంటే దీన్నే మింగుద్ది. ఆటిపిల్లల్నయ్యే మింగెత్తయ్యంట! ఆటికి తెలవదుకదా పిల్లలని" అంది సుబ్బమ్మ.

"తెలిసినాఆటి పొట్టతిప్పలు ఆటియ్యి. అయినా సేపలు పెద్దయ్యి సిన్నాటిని తింటయ్యిగాని మణుసులు సిన్నా పెద్దా భేదంలేదు. ఎవుడికందినోడినాడు పడగొట్టుకు తిండవే" అన్నాడు రామారావు.

ఓహోటలువనిసొచ్చి, రామారావుదగ్గర చేపముక్కలు మొత్తంమీద ముప్పైరూపాయలకు బేరమాడి తీసుకెళ్ళారు.

మూడురోజులనుంచి అయిసులోఉన్న సేప తాజాదనీదు ఖబుర్లమ్ముకుంటే, ఆ ఓటలోళ్ళు పదో పరకో మదుపెట్టి కూరొండి, ఇరవై మందికి ఇరవై ముక్కలుపెట్టి వంద రూపాయలు సంపాదిత్తారు. అనుకుంది తులసమ్మ. "మా యాయనన్నట్టు ప్రపంచకవంతా మోసవేనే" అంది సుబ్బమ్మతో.

"మీ యాయనేంటి బెమ్మంగారేనాడో సెప్పారు." అయినా మనం సిన్నోళ్ళం గెంజిలోకి ఉప్పురాయి కోసవని పడరాని పాట్లు పడతన్నాం. పెద్దాళ్ళు పెద్దుద్యోగస్తులున్నారు, యాపారస్తులున్నారు.

ఎవుడికాడు గుండెమీద చెయ్యేసుకు నాలోసిత్తే ఆడి మనసుకాడికి తెలవదా! ఆడెంతనాయంగాసంపాయిత్తనాడో అంది సుబ్బమ్మ.

అంతలో దోలుపట్టుకుని కోటిగాడొచ్చాడు. వస్తూనే ఒకమట్టగుడిశ తీసి లక్ష్మి మీదకు విసిరాడు. అది గోలగోలసేసింది.

ఉడాగడం మరీ ఎక్కువైంది మీ సిట్టి నిచ్చి పెళ్ళి చేసెయ్యి తులసీ అంది అవతలున్న రమణమ్మ.

ఛీ.... ఊడికా అంది తులసమ్మ. ఆడు సిగ్గు అభిమానం లేనట్టుంటాడని, ఆడోళ్ళకు అప్పా మొగోళ్ళకు చాలా బాగుంటాడని, అమాయకంగా మాటాడతాడుగాని కళ్ళనిండా కుచ్చితమేనని ఇదివరకు చాలాసార్లంది తులసమ్మ. చిట్టిని [illegible]ని అనడంతో, మరీ అసహ్యమేసింది వాడి మీద. ఛీ ఇలాటోడికా తనకూతుర్నిచ్చేది దానికెట్టా బుద్దిలేదా మాటంటానికి అని కోపగించుకుంది కూడా.

"అడికిట్టమే సిట్టిని జేసుకోడం" అంది సుబ్బమ్మ.



ఫొటో : శ్రీనగేష్

"తను లేనప్పుడెప్పుడో ఊళ్ళదిగి ఉంటారనుకుని ఊరుకుంది తులసమ్మ.

పదకొండు దాటింది మార్కెట్ మరీ పల్చబడింది. తన దగ్గరున్న కాసిని చేపలూ తులసమ్మకిచ్చేసి పునుగులు కొనుక్కుతిని అట్నుంచటే సినిమాకు వెళ్ళిపోయారు సుబ్బమ్మా, లక్ష్మి. తన దగ్గరున్న సెక్కలు, ముక్కలు. అక్కడే అమ్ముకుని వచ్చిన డబ్బులతో, సింత సిగురూ, సిన్నుల్లిపాయలూ బసయ్యకో పుగాక్కాడా, చిట్టికి జిలేబీకొని ఇంకా అర్థరూపాయ మిగిల్తె పావలా అప్పుపెట్టి పంచ్రగాములు కందిపప్పుకొని మధ్యాహ్నానికి ఇంటి ముఖం పట్టింది తులసమ్మ.

ఉసురోమనిఎండలో ఇల్లు చేరేసరికి, వాకిలి తలుపు లోపఃగడియవేసుంది. ఎసారాలో బసయ్యలేడు. తులసమ్మ గుండె ధడదడ లాడింది. నిస్త్రాణగా ఓక్షణం కుక్కిమంచంలో కూలబడింది. ఓ సారి అన్నివైపులా చూసింది. పక్కవాటాలోని జాలయ్య పెళ్ళాం మాత్రం గోనెమీద పడుకుని నిద్రబోతోంది ఇంకెక్కడాఅలికిడి లేదు. రోడ్డు చివర ఎక్కడికో వెళ్తూ బసయ్య కనిపించాడు లోపల చిట్టెందుకో కిసుక్కున నవ్వింది. తులసమ్మ చటుక్కున లేచి తలుపు కొట్టింది. చిట్టి పలకలేదు. 'చిట్టీ' పిలిచింది. కోపమో బాధో అర్థంకానిదేదో తులసమ్మ గొంతు పణికించింది. తలుపు తెరుచుకుని రాముడు బయటకొచ్చాడు.

చొక్కా పట్టుకుని ఆచెంపా ఈచెంపా వాయించాలనుకుంది. కాని జాలయ్య పెళ్ళాంలేస్తే, అమ్మో ఎంత అల్లరి లోపల చీకటి మూల చిట్టి మోకాళ్ళో తలపెట్టుకుని కూచుంది. చిట్టి జీవితమంతా చీకటిలో పడి కొట్టుకుంటున్నట్టు అనిపించింది తులసమ్మకు. చాలాసేపు నోట్లోమాట రానట్టు నెత్తిన చేతులుపెట్టుకుని కూర్చుంది. బసయ్య తిరిగొచ్చాడు 'ఇదిగోనమ్మా కంజిపప్పు' అని 'ఇదిగో, ఈ కొబ్బరుండ నోట్లోఏసుకో'అన్నాడు.

ఒద్దు ఒద్దంది. చిట్టి తిను తినమంటూ బలవంతాన చేతిలో పెట్టాడు. అది నోట్లో పెట్టిపెట్టగానే చటుక్కున లేచి బైటకు పరుగెత్తి బొళుక్కున వాంతి చేసుకుంది చిట్టి. తులసమ్మ ఒళ్ళు చల్లబడిపోయింది. కాళ్ళకింద భూమి కదిలిపోతున్నట్లు అనిపించింది. ఒక్కనిముషమే కళ్ళు మూసుకుని ఆలోచించింది. చెంపల మీద ధారలు కట్టిన కన్నీళ్ళు తుడుచుకుని లేచింది.

'ఎక్కడికే కూరొండకుండా' అంటున్న బసయ్యనునిదానించిచూసింది. అసలు విషయం తెలిస్తే అతడు చేసే హడావిడికి ఊరూ వాడా ఏకమౌతుందని తెలుసు. చంద్రమ్మింటి కెళ్లొత్తా. కోటిగాడికి చిట్టిని చేసుకుంటారేమో, అదీ నేనూ ఎల్లి అడిగొత్తాం.

"అయితే మాత్రం. యాలా పాలా లేదా, మంచీసెడూ జూసుకోటంలేదా! లేడికి లేసిందే పయాణమన్నట్టుంది. అయినా అడ్డి జులాయోడన్నావుగా"అని బసయ్య ఇంకా ఏదో అనబోతున్నా వినిపించుకోలేదు తులసమ్మ. ఈపాటికి సినిమా నుంచి వచ్చేసే ఉంటది చంద్రమ్మ. పదకొండింటికే ఎల్లింది. అనుకుంటూ చకచక అడుగులు వేసింది. 'పెద్ద సేపలు సిన్నాటిని దినటం సేపలనాయం మణిసికి మాత్రం పెద్దా సిన్నా భేదం లేదు. ఎవుడు కందినోడి నాడు పడగొట్టుకు తినడమె' అని రామారావు గొంతు పెద్దగా వినబడుతోంది తులసమ్మకు. నడక వేగం పెంచింది తులసమ్మ.